క్లుప్తంగా

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

డాక్టర్ ఎండీ. వాహజుద్దీన్‌ఖాన్



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వాహజుద్దీన్‌ఖాన్

షాద్‌నగర్‌రూరల్: సీజనల్ వ్యాధులపై ప్రతి ఒక్కరు అప్రమత్తంగా ఉండాలని యునాని ఆస్పత్రి డాక్టర్ ఎండీ.వాహజుద్దీన్ అన్నారు. సోమవారం ఫరూఖ్‌నగర్ మండలంలోని రంగంపల్లిలో మొగిలిగిద్ద యునాని ఆస్పత్రి ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వానాకాలంలో ఇంటి పరిసరాలు అపరిశుభ్రంగా ఉంటే ఈగలు, దోమలు వ్యాపించి అంటు వ్యాధులు వచ్చే అవకాశం ఉంటుందని తెలిపారు. పరిసరాల పరిశుభ్రతతో పాటుగా వ్యక్తిగత పరిశుభ్రతను తప్పనిసరిగా పాటించాలని అన్నారు. చిన్నపాటి అనారోగ్యానికి గురైన నిర్లక్ష్యం వహించకుండా వైదులను సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ శ్రీనివాస్‌యాదవ్, ఫార్మాసిస్టు అలవేలమ్మ, శ్రీనివాస్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

17న సర్ధార్ పాపన్నగౌడ్ విగ్రహ ఆవిష్కరణ



మాజీ ఎమ్మెల్యే కేఎల్‌ఆర్‌ను కలిసి ఆహ్వానం అందజేస్తున్న నాయకులు

చేవెళ్ల: మండల కేంద్రంలో గౌడ సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ విగ్రహ ఆవిష్కరణకు రావాలని చేవెళ్ల గౌడ సంఘం నాయకులు ఎమ్మెల్సీ మహేందర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే కేఎల్‌ఆర్‌లను కలిశారు. సోమవారం హైదరాబాద్‌లోని వారి వారి నివాసాల్లో చేవెళ్ల మండలకు చెందిన గౌడ సంఘం నాయకులు కలిసి ఆహ్వాన పత్రికలు అందజేశారు. దీనికి వారు సానుకులంగా స్పందించి తప్పకుండా వస్తామని చెప్పారు. కార్యక్రమంలో మండలంలోని గౌడ సంఘం నాయకులు పాల్గొన్నారు.

గ్రామాభివృద్ధికి సహకరించాలి

సర్పంచుల సంఘం జిల్లా అధ్యక్షుడు వెంకట్ రెడ్డి



సీసీ రోడ్డు పనులు ప్రారంభిస్తున్న వెంకట్ రెడ్డి

నందిగామ: గ్రామాన్ని అన్ని రకాలుగా అభివృద్ధి చేస్తున్నానని, అభివృద్ధి పనులకు గ్రామస్తులందరు సహకరించాలని సర్పంచుల సంఘం జిల్లా అధ్యక్షుడు, స్థానిక సర్పంచ్ వెంకట్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రమైన నందిగామలోని 7వ వార్డులో జీపీ నిధులు సుమారు రూ.30 లక్షల వ్యయంతో సీసీరోడ్డు పనులను అయన సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వెంకట్ రెడ్డి మాట్లాడుతూ.. గ్రామ పంచాయతీ పరిధిలోని అనుబంధ గ్రామాల్లో సైతం ఇప్పటికే సీసీ రోడ్లు పూర్తి చేశానని, ఎక్కడైన మిగిలిపోయిన పనులు ఉన్న చోట సాధ్యమైనంత వరకు పూర్తి చేయిస్తానని చెప్పారు. అదే విధంగా పాత జాతీయ రహ దారి నుంచి బైపాస్‌వరకు రోడ్డును విస్తరించి సీసీ, బీటీ రోడ్డుగా వేయనున్నట్లు, రోడ్డు విస్తరణకు గ్రామస్తులు సహకరించాలని సూచించారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ మెక్కొండ కుమార్ గౌడ్, వార్డు సభ్యులు రమేష్, సంజీవ,ఈశ్వర్ గ్రామస్తులు సతీష్,నర్సింహా, పాల్గొన్నారు.

రహదారి భద్రత నియమాలను తెలుసుకోవాలి

ఐ సడక్ జడ్చర్ల హైవే ప్రాజెక్టు మేనేజర్ ఇబ్రహీం

షాద్‌నగర్‌రూరల్: ప్రతి ఒక్కరు రహదారి భద్రత నియమాలను తెలుసుకోవాలని ఐ సడక్ జడ్చర్ల హైవే ప్రాజెక్టు మేనేజర్ ఇబ్రహీం అన్నారు. ఆజాదీకా అమృత్ మహోత్సవ్ కార్యక్రమంలో భాగంగా సోమవారం ఐ సడక్ వారి ఆధ్వర్యంలో మండల పరిధిలోని రాయికల్ జడ్పీహెచ్‌ఎస్ విద్యార్థులకు వ్యాసరచన, చిత్రలేఖనం పోటీలను నిర్వహించారు. గెలుపొందిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా ఇబ్రహీం మాట్లాడుతూ....రోడ్డు నియమ నిబంధనలను పాటిస్తూ వాహనాలను నడపాలని సూచించారు. మనం ఎంత వేగంగా వాహనాన్ని నడుపుతున్నామేది ప్రధాన కాదని ఎంత జాగ్రత్తగా వెళుతున్నామనేది ముఖ్యమని అన్నారు. చిన్నచిన్న పొరపాట్లతోనే రోడ్డు ప్రమాదాలు జరుగుతాయని, రోడ్డు ప్రమాదాలలో విలువైన ప్రాణాలను పోగొట్టుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో ఐ సడక్ సేఫ్టీ మేనేజర్ భానుప్రకాష్, ప్రధానోపాధ్యాయురాలు సువర్ణ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



శంకర్‌పల్లి: గద్దర్ చిత్ర పటానికి నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు



చేవెళ్ల: గద్దర్‌కు నివాళులర్పిస్తున్న సీపీఐ నాయకులు

గద్దర్‌కు నివాళి

ప్రజాగాయకుడు గద్దర్ మృతి పట్ల సోమవారం చేవెళ్ల, షాద్‌నగర్‌లోని ప్రజాప్రతినిధులు, కళాకారులు, ప్రజలు ఆయన చిత్ర పటానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర ఉద్యమంలో కీలక పాత్ర పోషించారని అన్నారు. ప్రజా ఉద్యమాలకు ఊపిరి పోసి, సమాజాన్ని చైతన్యం చేసి వారి హక్కుల కోసం నిరంతరం కృషి చేసిన మహనీయుడు గద్దర్ అని కొనియాడారు.

– సాక్షి, నెట్‌వర్క్



షాద్‌నగర్: గద్దర్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు



గద్దర్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు



షాద్‌నగర్‌రూరల్: నివాళులర్పిస్తున్న అధ్యాపకులు, విద్యార్థులు

ఉద్యోగమే లక్ష్యంగా..



జగదీశ్వర్



సంధ్యారాణి



రాహుల్

కొందుర్గు: గ్రామీణ ప్రాంతాలకు చెందిన నిరుపేద కుటుంబాల విద్యార్థులు ఎస్‌ఐలుగా అర్హత సాధించారు. ఉద్యోగమే లక్ష్యం కష్టపడి చదివి ఎస్‌ఐ ఉద్యోగానికి పలువురు విద్యార్థులు ఎంపికయ్యారు. కొందుర్గు మండలం విశ్వనాథ్‌పూర్ గ్రామానికి చెందిన గుండేటి చంద్రకళ, రామ్‌రెడ్డి దంపతుల కూతురు సంధ్యారాణి కొందుర్గు గ్రామానికి చెందిన రాయికంటి బుచ్చమ్మ, మల్లేశ్వర్ దంపతుల కుమారుడు జగదీశ్వర్, జిల్లేడ్ చౌదరిగూడ మండలం గాలిగూడ గ్రామానికి రాహుల్ ఎస్‌ఐలుగా అర్హత సాధించారు. వీరు ముగ్గురు నిరుపేద వ్యవసాయ కుటుంబాలకు చెందిన వారు ఎస్‌ఐలుగా అర్హత సాధించడం అభినందనీయమని స్థానికులు సంతోషం వ్యక్తం చేశారు.

సివిల్ ఎస్‌ఐగా గాయత్రి

కేశంపేట: మండలంలోని చౌలపల్లి గ్రామ శివారులోని మీనమోనిపల్లికి చెందిన అనసోసల గాయత్రి సబ్‌ఇన్‌స్పెక్టర్ (సివిల్) పోస్టును సాధించింది. గ్రామానికి చెందిన సత్యానారాయణ రెండవ కుమార్తె గాయత్రి ఎస్‌ఐ మెయిన్స్ పరీక్షా ఫలితాల్లో అర్హత సాధించడంపై గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

రైతు బిడ్డలు ఎస్‌ఐలయ్యారు..

చేవెళ్ల: మండలంలోని గుండాల గ్రామానికి చెందిన నక్క ప్రశాంత్‌రెడ్డి, నాంచేరి గ్రామానికి చెందిన కొకుంట్ల వెంకటేశ్‌లు ఎస్‌ఐ ఫలితాల్లో అర్హత సాధించారు. వీరు ఇద్దరు వ్యవసాయ కుటుంబానికి చెందిన వారు కావడం విశేషం. గుండాల గ్రామానికి చెందిన రైతు నక్క నర్సింహ్మారెడ్డి, లక్ష్మిలకు నక్క ప్రశాంత్‌రెడ్డి ఒక్కడే కొడుకు గత ఐదేళ్ల క్రితమే కానిస్టేబుల్ పరీక్షలో ఎంపికై ప్రస్తుతం శంషాబాద్‌లో కానిస్టేబుల్‌గా ఉద్యోగం చేస్తున్నాడు. ఎస్‌ఐ పరీక్షలకు సైతం దరఖాస్తు చేసి పరీక్షలు రాశాడు. ఈ ఫరీక్షల ఫలితాల్లో మొదటి ప్రయత్నంలోనే ఎస్‌ఐ(సివిల్)ఎంపికయ్యాడు. అలాగే, మండలంలోని నాంచేరి గ్రామానికి చెందిన కొకుంట్ల అంజయ్య, లక్ష్మిల చిన్నకొడుకు కొకుంట్ల వెంకటేశ్ ఎస్‌ఐ ఫలితాల్లో విజయం సాధించి స్పెషల్ ప్రొటక్షన్ ఫోర్స్‌లో ఎస్‌ఐగా ఎంపికైయ్యాడు. తండ్రి అంజయ్య పాలవ్యాపారం, వ్యవసాయం చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. దీంతో వారిని స్థానికులు అభినందిస్తున్నారు.



గాయత్రి



ఎస్‌ఐగా ఎంపికైన నక్క ప్రశాంత్‌రెడ్డి



కొకుంట్ల వెంకటేశ్

కాంగ్రెస్ పార్టీ విజయం ఖాయం



కాంగ్రెస్‌లో చేరుతున్న బీఆర్‌ఎస్, బీజేపీ నాయకులు

మాజీ ఎమ్మెల్యే కిచ్చన్నగారి లక్ష్మారెడ్డి

మొయినాబాద్‌రూరల్: రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ గెలుపు ఖాయమని భావించి ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున కాంగ్రెస్‌లో చేరుతున్నారని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు, మాజీ ఎమ్మెల్యే కిచ్చన్నగారి లక్ష్మారెడ్డి అన్నారు. సోమవారం చేవెళ్ల నియోజకవర్గంలోని బాకారం, జాగీరు, నక్కలపల్లి గ్రామాల నుంచి బీఆర్‌ఎస్, బీజేపీ వార్డు సభ్యులు, నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున కేఎల్‌ఆర్ నివాసంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజావ్యతిరేక బీఆర్‌ఎస్ ప్రభుత్వాన్ని గద్దె దించడానికి ప్రతి నాయకుడు సైనికుడిగా పని చేయాలన్నారు. ఒక్కో నాయకుడు వెయ్యి మంది ఓటర్లను ప్రభావితం చేసి కాంగ్రెస్ గెలుపే లక్ష్యంగా పని చేయాలని సూచించారు. పార్టీ బలోపేతానికి గ్రామ గ్రామాన కేఎల్‌ఆర్ పర్యటనకు స్థానిక నాయకులు రోడ్‌షో మ్యాప్ సిద్ధం చేశారన్నారు. గౌడసంఘం నాయకులు కేఎల్‌ఆర్‌ను కలిసి సర్ధార్ సర్వాయి పాపన్నగౌడ్ విగ్రహావిష్కరణ కార్యక్రమానికి ఆహ్వానించడం సంతోషకరమన్నారు. కార్యక్రమంలో టీపీసీసీ కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి గౌరీసతీష్, టీపీసీసీ కార్యవర్గ సభ్యులు చేవెళ్ల కాంగ్రెస్ నాయకుడు దర్శన్, మొయినాబాద్ మండల పార్టీ అధ్యక్షుడు మాణయ్య, పీసీసీ ఫిషర్‌మ్యాన్ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు నారాయణ మహేందర్‌ముదిరాజ్, చేవెళ్ల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు శ్రీనివాస్‌యాదవ్, ఉపాధ్యక్షుడు నిరంజన్‌గౌడ్, పీఏసీఎస్ చైర్మన్ చంద్రారెడ్డి, హిమాయత్‌నగర్ బైకనీ కుమార్‌యాదవ్, నాయకులు పాల్గొన్నారు.

గిరిజనులకు కన్నీళ్లే మిగిలాయి

ఆదివాసీ కాంగ్రెస్ రాష్ట్ర కో ఆర్డినేటర్ రఘు



సమస్యలను తెలుసుకుంటున్న నాయకులు

షాద్‌నగర్‌రూరల్: బీఆర్‌ఎస్ నియంతృత్వ పాలనలో గిరిజనులకు కన్నీళ్లే మిగిలాయని ఆదివాసీ కాంగ్రెస్ రాష్ట్ర కో ఆర్డినేటర్ రఘు విమర్శించారు. గిరిజన తండాల్లో నెలకొన్న సమస్యలను తెలుసుకునేందుకు ఆదివారం రాత్రి ఆదివాసీ కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షుడు శ్రీనునాయక్ ఆధ్వర్యంలో మండలంలోని నాగర్లగడ్డ తండాలో బస చేశారు. ఈ సందర్భంగా తండాలో నెలకొన్న సమస్యలను తండావాసులు నాయకులకు విన్నవించారు. అనంతరం రఘు మాట్లాడుతూ.. తండాలను పేరుకే గ్రామ పంచాయతీలుగా చేశారని, తండాలకు జీపీ భవనాలు లేక పాలన కొనసాగలేని పరిస్థితి నెలకొందని అన్నారు. కార్యక్రమంలో గోపాల్ నాయక్, సంజునాయక్, రాజునాయక్, మేఘ్యానాయక్, జగన్‌నాయక్, రవి, అరుణ్‌నాయక్, చందునాయక్, మధునాయక్ పాల్గొన్నారు.

ఆమనగల్లు తహసీల్దార్‌గా లలిత

ఆమనగల్లు: ఆమనగల్లు మండల తహసీల్దార్‌గా సోమవారం సీహెచ్ లలిత బాధ్యతలు చేపట్టారు. ఆమనగల్లు తహసీల్దార్‌గా పనిచేసిన జ్యోతి హైదరాబాద్ జిల్లాకు బదిలీ అయ్యారు. ఆమె స్థానంలో రంగారెడ్డి జిల్లా కలెక్టర్ కార్యాలయంలో సీ సెక్షన్‌లో పనిచేస్తున్న గిరిజను ఆమనగల్లు తహసీల్దార్‌గా నియమించిన విషయం తెలిసిందే. అయితే ఆమనగల్లు రావడానికి గిరిజ విముఖత చూపడంతో లలితను ఆమనగల్లుకు బదిలీచేశారు.

కార్పొరేట్ సంస్థలకు బీజేపీ కొమ్ము కాస్తోంది

వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జంగయ్య

కొందుర్గు: బీజేపీ ప్రభుత్వం కార్మిక చట్టాలను కాలరాసి కార్పొరేట్ సంస్థలకు కొమ్ముకాస్తుందని సీపీఐ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బుద్దుల జంగయ్య అన్నారు. ఐఎటీయూసీ, సీఐటీయూ ఆధ్వర్యంలో సోమవారం కొందుర్గు మండల కేంద్రంలో సీపీఐ. సీపీఎం నాయకులు మహాధర్నా గోడపత్రికను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జంగయ్య మాట్లాడుతూ.. నరేంద్రమోదీ ప్రభుత్వం 40 కార్మిక చట్టాలను నాలుగు జోన్‌లుగా విభజించి కార్మిక సంఘం ఏర్పాటుచేసుకునే హక్కున సహితం లేకుండా చేసిందన్నారు. పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలతో పాటు నిత్యావసర ధరలు పెరగడానికి కారణం నరేంద్రమోదీ ప్రభుత్వమేనన్నారు. ఎన్‌వీ యాక్ట్ 2019, ఎలక్ట్రిసిటి 2022 లను వాపస్ తీసుకోవడాలని డిమాండ్ చేశారు. కార్మికులకు పీఎఫ్, ఈఎస్‌ఐ సదుపాయం కల్పించాలన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు రాయికంటి గోపాల్, నాయకులు రేణమ్మ, లక్ష్మమ్మ, జయమ్మ పాల్గొన్నారు.



గోడ పత్రికను విడుదల చేస్తున్న నాయకులు

పశువులకు టీకాలు తప్పనిసరి



టీకాలు వేస్తున్న డాక్టర్ చంద్రశేఖర్‌రెడ్డి

డాక్టర్ చంద్రశేఖర్‌రెడ్డి, షాబాద్ డాక్టర్ స్రవంతి

షాబాద్: పశుపోషకులు పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేయించాలని రేగడిదోస్వాడ డాక్టర్ చంద్రశేఖర్‌రెడ్డి, షాబాద్ డాక్టర్ స్రవంతి పేర్కొన్నారు. సోమవారం మండలంలోని మద్దూరు, రాంసింగ్‌తండాల్లో పశువులకు గాలికుంటు నిరోధక టీకాలు వేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. 3నుంచి 4 నెలల వయస్సు ఉన్న ఆవు, గేదెలకు టీకాలు వేయించాలన్నారు. మండలంలోని అన్ని గ్రామాల్లో టీకాల పంపిణీ కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. పశువులకు ప్రభుత్వం ఏడాదిలో రెండు విడతలు గాలికుంటు నివారణ టీకాలు వేసే కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో పశువైద్య సిబ్బంది తదితరులున్నారు.

పశువుల పట్ల జాగ్రత్తలు వహించాలి

కొత్తూర్: సీజనల్ వ్యాధులపై పశుపోషకులు జాగ్రత్తలు వహించాలని మండల పశువైద్యాధికారి డాక్టర్ స్ఫూర్తి అన్నారు. కొత్తూర్ మున్సిపాలిటీలోని కుమ్మరిగూడలో సోమవారం పశువైద్య శిబిరాన్ని నిర్వహించి,100 పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలతో పాటు నట్టల మందులను వేశారు. పశువులకు వ్యాధు లు సోకకుండా ముందు జాగ్రత్తగా టీకాలను వేయించుకోవాలని ఆమె సూచించారు. కార్యక్రమంలో కౌన్సిలర్ మాధవి గోపాల్, శ్రీలత, మల్లయ్య, కృష్ణ, రవి, రాజు, పద్మ, వెంకటయ్య, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

'మున్సిపాలిటీ' నిర్ణయం సరికాదు



విలేకరులతో మాట్లాడుతున్న కే.ఎస్.రత్నం

మాజీ ఎమ్మెల్యే కే.ఎస్.రత్నం

శంకర్‌పల్లి: మోకిల చుట్టూ పక్కల గ్రామాలను కలుపుకొని మున్సి పాలిటీని చేస్తామన్న నిర్ణయం సరికాదని మాజీ ఎమ్మెల్యే కే.ఎస్.రత్నం పేర్కొన్నారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. మోకిలను మున్సిపాలిటీ చేయడం వల్ల పేదలు ఉపాధి కోల్పోయే అవకాశాలు ఉన్నాయన్నారు. గ్రామాల్లో ఉపాధి పనులు, కూలీ పనులు చేసుకుంటూ ఎంతో మంది పేద రైతులు జీవనం సాగిస్తున్నారని, మున్సిపాలిటీగా ఏర్పాటు చేస్తే వారిపై పెనుభారం పడుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇంటి పన్నులు పెరగడంతో పాటు, ఇంటి నిర్మాణాల అనుమతులకు కూడా ఖర్చు పెరుగుతుందన్నారు. అన్ని గ్రామాల సర్పంచ్, ఎంపీటీసీల, ప్రజాప్రతినిధుల, ప్రజల అభిప్రాయాలు సేకరించి మున్సిపల్ శాఖ మంత్రి కేటీఆర్‌కి వినతి పత్రం అందించడం జరుగుతుందని స్పష్టం చేశారు. ప్రజలు ఎటువంటి గాలి వార్తలను నమ్మకూడదని విన్నవించారు. కార్యక్రమంలో కొండకల్ ఎంపీటీసీ సురేందర్‌రెడ్డి, మోకిల మాజీ ఎంపీటీసీ యాదయ్య, నాయకులు బయన్న, శివకుమార్, శ్రీనివాస్, ప్రతాప్‌రెడ్డి పాల్గొన్నారు.

తల్లపాలే బిడ్డకు సంపూర్ణ ఆరోగ్యం



తల్లిపాల వారోత్సవాలలో పాల్గొన్న సీడీపీఓ

సీడీపీఓ నాగమణి

షాద్‌నగర్‌రూరల్: తల్లిపాలు బిడ్డకు సంపూర్ణ ఆరోగ్యాన్ని ఇస్తాయని, బిడ్డ పుట్టిన గంట లోపు తల్లి పాలను పట్టించాలని సీడీపీఓ నాగమణి అన్నారు. ఫరూఖ్‌నగర్ మండలంలోని ఎలికట్టలో సోమవారం అంగన్‌వాడీ సూపర్‌వైజర్ అండాలు ఆధ్వర్యంలో తల్లి పాల వారోత్సవాలను నిర్వహించారు. ఈ సందర్భంగా తల్లిపాల ఆవశ్యకతపై బాలింతలుకు, గర్భిణీలకు అవగాహన కల్పించారు. అనంతరం నాగమణి మాట్లాడుతూ.. బిడ్డకు తల్లిపాలు అమృతంతో సమానమని అన్నారు. శిశువుల్లో పోషకాహారం లోపిస్తే తీవ్ర పరిణాలను ఎదుర్కోవాల్సి వస్తుందన్నారు. ముర్రు పాలు రోగ నిరోధక శక్తిని పెంచేందుకు ఎంతగానో దోహదపడతాయని తెలిపారు. కార్యక్రమంలో వార్డు సభ్యురాలు విజయలక్ష్మి, డాక్టర్ ప్రవీణ, ప్రధానోపాధ్యాయురాలు సక్కుబాయి, ఉపాధ్యాయులు అంగన్‌వాడీ టీచర్లు ఆశవర్కర్లు పాల్గొన్నారు.

తల్లిపాలు బిడ్డకు ఆరోగ్యం

చేవెళ్ల: తల్లిపాలు బిడ్డకు ఎంతో మేలు చేస్తాయని ఐసీడీఎస్ సీడీపీఓ శోభారాణి అన్నారు. సోమవారం మండలంలోని కొకుంట్లలో ఆలూరు క్లస్టర్ పరిధిలోని అంగన్‌వాడీల ఆధ్వర్యంలో తల్లి పాల వారోత్సవాల కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రతి తల్లి పుట్టిన బిడ్డలకు తప్పనిసరిగా తల్లిపాలు పట్టించాలని చెప్పారు. ముర్రు పాలు తాగించటం వల్ల బిడ్డకు రోగ నిరోధకశక్తి పెరుగుతుందన్నారు. పుట్టిన బిడ్డ నుంచి 6 నెలల వరకు బిడ్డలకు తల్లి పాలు మాత్రమే పట్టించాలన్నారు. 7వ నెల నుంచి అనుబంధ ఆహారం పెడుతూ 2 సంవత్సరాల వరకు తల్లిపాలు కొనసాగించాలని సూచించారు. తల్లిపాల ప్రాముఖ్యత ప్రతి మహిళ తెలుసుకోవాలన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ శకుంతల, అంగన్‌వాడీ టీచర్లు సరళ, పుష్పవేణి, గ్రామంలోని మహిళలు తల్లులు, పిల్లలు పాల్గొన్నారు.

సమ్మెను మరింత ఉధృతం చేస్తాం

సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి దేవేందర్

షాబాద్: జీపీ కార్మికుల సమ్మెను మరింత ఉధృతం చేస్తామని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి అల్లి దేవేందర్ పేర్కొన్నారు. సోమవారం మండల కేంద్రంలో ముంబాయి-బెంగళూరు లింకు జాతీయ రహదారిపై వంటావార్పు, ధర్నా, రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామ పంచాయతీ కార్మికులు గత 34 రోజులుగా నిరవధిక సమ్మె చేస్తున్నారు. అసెంబ్లీలో దాదాపు 20 మంది ఎమ్మెల్యేలు కార్మికుల సమస్యలపై మాట్లాడిన సీఎం కేసీఆర్ స్పందించలేదని ఆరోపించారు. కార్మికుల సమస్యలపై జీఓ విడుదల చేసే వరకు సమ్మె కొనసాగుతుందని తెలిపారు. కార్యక్రమంలో రవి, యాదయ్య, యాదమ్మ, స్వరూప, కవిత, బాబయ్య, రత్నమ్మ, నర్సింహులు, పగులయ్య తదితరులున్నారు.

కార్మికుల డిమాండ్లను పరిష్కరించాలి

మొయినాబాద్‌రూరల్: జీపీ కార్మికులు న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం పరిష్కరించాలని సీఐటీయూ మండల అధ్యక్షుడు రత్నం పేర్కొన్నారు. సోమవారం వినూత్న రీతిలో ప్రదర్శనలు చేసి మండల అభివృద్ధి అధికారికి తమ డిమాండ్ల పత్రం అందజేశారు. ఈ సందర్భంగా రత్నం, పంచాయతీ కార్మికుల మండల అధ్యక్షుడు అంజనేయులు గౌడ్‌లు మాట్లాడుతూ.. రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 40 వేల మంది కార్మికులు 34 రోజులుగా సమ్మె చేస్తుంటే ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. ప్రభుత్వానికి గ్రామ పంచాయతీ కార్మికులపై కక్ష కట్టినట్లు కనబడుతుందని వాపోయారు. ప్రభుత్వం కార్మికుల ఉద్యమాన్ని అణచివేయాలని ప్రయత్నం చేస్తుందని మండిపడ్డారు. కార్యక్రమంలో సుధాకర్, లక్ష్మి, భారతమ్మ, అనసూయ, లక్ష్మి పాల్గొన్నారు.

సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి దేవేందర్

చేవెళ్ల: జీపీ కార్మికుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించి వారికి ఉద్యోగ భద్రత కల్పించాలని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి అల్లి దేవేందర్ అన్నారు. సోమవారం గ్రామ పంచాయతీ కార్మికుల సమ్మె 34వ రోజు కొనసాగింది. ఈ సందర్భంగా దేవేందర్ మాట్లాడుతూ.. ప్రభుత్వం గ్రామ పంచాయతీ కార్మికులను వెంటనే పర్మినెంట్ చేసి, 51జీఓను రద్దు చేయాలన్నారు. మల్టీపర్పస్ విధానాన్ని కూడా రద్దు చేయాలని డిమాండ్ చేశారు. పంచాయతీ కార్మికులందరికి ఈఎస్ఐ, పీఎఫ్ సౌకర్యం కల్పించాలనన్నారు. 10లక్షల రూపాయల బీమా సౌకర్యం కల్పించాలని, రిటైర్డ్‌మెంట్ బెనిఫిట్స్‌ను అందించాలన్నారు. సమ్మెలో గ్రామ పంచాయతీ యూనియన్ మండల అధ్యక్షుడు నర్సింలు, నాయకులు జ్ఞానేశ్వర్, మల్లేశ్, మహేందర్, భాస్కర్, రాఘవేందర్, మల్లయ్య, నర్సింహ్మ పాల్గొన్నారు.

జీపీలు ఆదాయ వనరులుగా ఎదగాలి

కేశంపేట: గ్రామ పంచాయతీలు ఆదాయ మార్గాలను పెంపొందించుకోవాలని ఎంపీపీ ఎల్లనమోని రవీందర్ యాదవ్ పేర్కొన్నారు. సోమవారం మండలంలోని కొత్తపేట గ్రామ పంచాయతీ ఏర్పాటు చేసిన పశువులు, మేకల సంతను రవీందర్‌యాదవ్ ప్రారంభించి మాట్లాడారు. గ్రామ పంచాయతీలు ప్రభుత్వం ఇస్తున్న నిధులతోనే కాకుండా సొంతంగా నిధులు వచ్చేలా అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ నవీన్‌కుమార్, వర్కాల లక్ష్మీనారాయణగౌడ్, మల్లేష్ యాదవ్, జమాల్‌ఖాన్, కృష్ణయ్య, నరేష్‌యాదవ్, జగన్‌రెడ్డి, లక్ష్మయ్య, కుమార్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



సంతను ప్రారంభిస్తున్న రవీందర్‌యాదవ్



భోజనాలు చేస్తున్న దేవేందర్, కార్మికులు